# నన్ను చెప్పనివ్వండి

-కవేరా

"ఇతడు నీకెలా తెలుసు?" అని స్వామి గురించి ఒకసారి నా చిరకాల మిత్రుడు రామకృష్ణ అడిగారు.

"మనవాడు అప్పారావు ఇక్కడే ఉన్నాడు కదా! అతని ద్వారా పరిచయం. వారింటికి దగ్గర్లో ఉంటాడు. హిందీ టీచరుగా రిటైరయ్యాడు. ఇప్పుడిప్పుడే పరిచయమౌతు న్నాడు" అన్నాను.

"నేను ప్రక్క ఊళ్ళో హైస్కూలు హెడ్మాస్టరుగా ఉన్న ప్పుడు ఇతడు మా స్కూల్లో హిందీ టీచరు. కాని హిందీ బాగా రాదు. మరి పాఠం ఎలా చెప్పగలడు? అయినా ఇబ్బంది పడకుండా సర్వీసంతా గడిపేశాడు."

"మా హైస్కూలు ఉపాధ్యాయులెవ్వరూ ఆ ఊళ్ళో కాపురం లేరు. అందరూ నాతో సహా వేరేచోట్ల నుండి వచ్చేవారే. అయితే దాదాపు అందరికీ మోటారు వాహనాలున్నాయి. ఇతడు మాత్రం స్కూలుకు సైకిలు మీద వచ్చేవాడు. దారిలో విద్యార్థులెవరైనా కనిపించి నమస్కరిస్తే ఇతడు సైకిలు దిగి బుద్ధిగా ప్రతి నమస్కారం చేసేవాడు. సైకిలు తొక్కడం అంతగా రాదు. ఈ అలుసు కనిపెట్టి చాలామంది కుర్రవాళ్ళు తరచుగా ఇతడికి దారిలో ఎదురుపడి నమస్కారం పెట్టేవారు. ఆ విధంగా ఇతడు స్కూలులో అందరికీ పరిచయం. ఒకసారి ఒక విద్యార్థి ఆకస్మికంగా ఎదురై నమస్కరించాడు. ఈయనగారు గాబరాపడిపోయి సైకిలు మీద ఉంటూనే హేండిల్ బార్ వదిలేసి రెండు చేతులతో ఆ విద్యార్థికి ప్రతి నమస్కారం చేయబోయాడు. ఇంకేముంది? సైకిలు మీది నుంచి క్రిందపడ్డాడు. చేతులకు, కాళ్ళకు, ముఖానికి కూడా గాయాలయ్యాయి. మనిషి కాస్త లావు కదా! దెబ్బలు గట్టిగానే తగిలాయి. స్కూలుకు అలానే వచ్చాడు. జరిగింది జరిగినట్లు అందరికీ చెప్పాడు."

"ఎంత మంచి పనినైనా భ్రష్టుపట్టించడంలో మన ఆంధ్రులు మొదటివారు. మనకు హిందీ రాజభాష అయిన తరువాత స్కూళ్ళలో హిందీ బోధన విస్తృతంగా ప్రవేశపెట్టారు. కాని తగినంత మంది హిందీ ఉపాధ్యాయులు లేరు. తగినన్ని హిందీ ఉపాధ్యాయ శిక్షణ సంస్థలూ లేవు. మరి విద్యార్థులకు హిందీని నేర్పడమె లాగ? అప్పుడు దక్షిణ భారత హిందీ ప్రచార సభ హిందీ పండితులను ముమ్మరంగా తయారుచేసే బాధ్యతను చేపట్టింది. ప్రావీణ్యాన్ని గాలికి వదిలేసిందనే అనుకో వాలి. అందులో మనవాడు కొట్టుకొచ్చాడు. ఫలితం- ముప్పై ఏళ్ళపాటు అతడు పాఠం చెప్పే విద్యార్థులకు హిందీ అబ్బలేదు. పిల్లలకు పాఠాలు బాగా చెప్పాలండీ. ఫలితాలు అధ్వాన్నంగా ఉన్నాయని పైనుండి కాగితాలు వస్తున్నాయి అని అంటే "హిందీకి పాసు మార్కులు పదిహేనే. మరి పిల్లలను చదవమంటే చదువుతారా, మన వెర్రిగాని" అని జవాబిచ్చేవాడు. మారుమాటకు అవకాశం లేకుండా వస్తానండీ. తరగతికి వేళ అయిం దనో, ఇంకేదో కారణం చెప్పి అక్కడి నుంచి జారుకునే వాడు. హిందీ రానంత మాత్రాన, చదువు చెప్పలేనంత మాత్రాన అతడేమీ బాధపడలేదు. నష్టపోలేదు. రిటైరయ్యే వరకూ విద్యాశాఖకు ఇల్లరికపుటల్లుడుగా నెలనెలా జీతం పుచ్చుకొన్నాడు." ఇది స్వామి గురించి రామకృష్ణ నాతో ఆ రోజున చెప్పినది. చివరి వాక్యం కొంచెం అక్కసుతోనే అన్నాడు. పనిచేయని వాళ్ళు అతడికి ఇష్టపడరు. ఇష్టపడని వాళ్ళను అతడలాగే అంటాడు. అంచేత స్వామి నా దృష్టిలో కొంత చులకనయ్యాడనే చెప్పాలి.

ఆ తరువాత స్వామి నాకు బాగానే పరిచయ మయ్యాడు. పైకి అమాయకంగా కనిపించినా అతడు బ్రతకడం తెలియనివాడేమీ కాదు. తనకు సంతానం లేదు. సంతోషంగా తమ్ముడి కూతుర్ని పెంచుకున్నాడు. మంచి అల్లుణ్ణి సంపాదించుకున్నాడు. చక్కని ఇల్లు కట్టుకున్నాడు. మనమలూ, మనమరాళ్ళూ ఉన్నారు. ఏ సమస్యా లేకుండా హాయిగా బ్రతికేస్తున్నాడు.

మా అప్పారావు ఇతన్ని "నిరంతర వర్తమానం" (Present Continuous) అంటాడు. ఇతడు చేపట్టిన ఏ పనీ పూర్తికాదు. అలా జరుగుతూనే ఉంటుంది. అంటే ఆ పని ఎప్పటికీ అవ్వదని కాదు. ఎప్పుడో అవుతుంది. బజారుకెళ్ళడానికి ఉదయం 9 గంటల నుంచి ప్రయత్నమే. 11 గంటలకు గాని తెమలడు. ఇంతకీ బజారుకెళ్ళి చేసేదేమిటి? హోటలులో కాఫీ త్రాగడం, దాంతో ఆ ఉదయం పని అయిపోయింది. తిరిగి ఇంటికి రావడం, మధ్యాహ్నం భోజనం చెయ్యడం, విశ్రాంతి. సాయంత్రం మరల బజారుకు ప్రయాణం, కాఫీ త్రాగడం. తెలిసిన షాపులో కొంతసేపు బాతాఖానీ. రోడ్డు మీద ఎవరైనా కనిపిస్తే మాట్లాడుతూ ఉండడం, ఎంతలేదన్నా ఇంటికి తిరిగి వచ్చేసరికి రాత్రి ఎనిమిది గంటలయిపోతుంది. ఇక రాత్రి భోజనం, కొద్దిసేపు టీవీ చూడడం.. నిద్రపోవడం. ఎంత నిష్పూచీ అయిన దినచర్య!

అతడికి చేతనయినది పద్యాలు రాయడం. అదీ నెలకో, ఏ రెండు నెలలకో. చెప్పిన భావాలే. మళ్ళీ మళ్ళీ మరో విధంగా. అయినా కవిగా గుర్తింపు సాధించాడు. ఒక సాహిత్య సంస్థకు అధ్యక్షుడు కూడ. అతడు జరిపిన మొదటి సభ ముగిసినదీ లేనిదీ అయిపోయిన చాలా సేపటి వరకూ మాకెవరికీ తెలియలేదు. మా అప్పారావు అన్నట్లు అతడు నిరంతర వర్తమానం.

ఉగాదికి మరొక సభ జరిగింది. ఇతడు గాబరా మనిషి. నిర్వహణ సరిగా ఉంటుందో లేదో అని ఆ సంస్థ కార్యదర్శి కూడ వేదిక పైనుండి సమయోచితంగా సభను నిర్వహించాలనుకున్నాడు. సదుద్దేశమే. ఇతడేమో తనే అధ్యక్షుడు కావున ఆ బాధ్యతంతా తనే నిర్వహించా లనుకున్నాడు. ఫలితం.. మైకును వారిచేతిలోంచి వీరు లాక్కోవడం. వీరి చేతిలోంచి వారు లాక్కోవడం, సభా నిర్వహణ నవ్వులపాలు కావడం.

నాకెందుకో ఆ మధ్య అనుమానం కలిగింది. నాకు ఉపన్యాసకునిగా గుర్తింపు రావాలని కోరిక. అందుకని కొంచెం చొరవ చేస్తుంటాను, అప్పుడప్పుడు మాట్లాడ డానికి. "వీడికి నేను తీసిపోతానా?" అని అనుకున్నాడో ఏమో, నేను సభలో మాట్లాడిన ప్రతిసారీ అతడూ మాట్లాడాడు. "ఏం మాట్లాడాలో ముందుగా అనుకోలేదు అయినా మాట్లాడాలనిపించింది. మాట్లాడుతున్నాను" ఇదీ అతని ప్రసంగ ప్రారంభం, ఆ సమయంలో.

నేనొకసారి ఒక ప్రాచీన కావ్యంపై ప్రసంగించడానికి సాహసం చేశాను. కొంతసేపయ్యాక ఉపన్యాసం ముందుకు సాగలేదు. ఒకవిధంగా అది అర్థాంతరంగానే ముగిసింది. తలవంపులయ్యింది. "మీరు ఉపన్యసిస్తుంటే నా ఒళ్ళు జలదరించిందండీ" అన్నాడు. నాకు నవ్వాలో, ఏడవాలో తెలియలేదు.

ఇక సంభాషణకు వస్తే అవతలివాడు చెప్పిన ప్రతిదానికీ వంత పాడుతాడు. "అవునవును", "నాకూ తెలుసును", "నేనూ చూశాను", "నేనూ చదివాను", "నేనూ విన్నాను" ఇలా అంటుంటాడు. ఒకసారి "ఏమి విన్నారో చెప్పండి" అని నిలదీశాను. "వెంటనే అలా ముఖం మీద అడిగేస్తే ఎలాగ?" అన్నాడు.

ఆ మధ్య జటావల్లభుల పురుషోత్తంగారి ప్రసక్తి వచ్చింది, కొంత మంది స్నేహితుల మధ్య "వారు గొప్ప ఉపన్యాసకులంటారు" అన్నారెవరో. "అవునవును. విజయవాడలో ఉన్నప్పుడు నేను వారి ఉపన్యాసం విన్నాను" అన్నాడు. "వారు మనకంటె ముందు కాలం వారు. బహుశా మీరు జమ్మలమడక వారిని వినుంటారు" అని అన్నాను. ఏమంటాడో విందామని. "అవునవును. నేనూ అలాగే అనుకున్నాను" అన్నాడు.

ఇది అమాయకమా? కాదు. వెకిలితనమా? కాదు. గొప్పకు పోవడమా? కాదు. మరేమిటి? అదే నాకు అప్పుడప్పుడు ఎదురైన ప్రశ్న. అయినా సరే అతనినెవరూ కించపరచరా. గౌరవంగానే చూస్తారు. నాకే ఒక్కోసారి అతడిమీద ఒళ్ళు మండుతుంది, అతని అవకతవకల జవాబులకు. అలాంటి సమయంలో ఒకసారి "ఈ మధ్య మీ ఆవిడ మిమ్ములను నలుగురిలోనూ దులిపేసిందటగా, ఎందుకనో" అన్నాను మామూలు ధోరణిలో. "అవున వును. నేనూ విన్నాను" అదీ అతని సమాధానం.

ఒకసారి అతడు మా ఇంటికి వస్తే "స్నానం చేసి ఇప్పుడే వస్తాను అందాక పేపరూ అవీ చూస్తుండండి" అంటూ ఆ రోజు దినపత్రిక, ఒకటి రెండు పుస్తకాలు ఇచ్చాను. ఆ పుస్తకాల మధ్య పైవిధంగా అతనిని దృష్టిలో పెట్టుకొని రాసిన కాగితాలనూ ఉంచాను, అతడు చదవాలనే. కొంత నిదానంగానే స్నానం చేసి వచ్చాను. అతని ముఖంలో ఎటువంటి మార్పు లేదు. మామూలు గానే కనిపించాడు. ఎప్పటిలాగే ఏవో కబుర్లు చెప్పు కున్నాం. కొంతసేపుండి అతడు వెళ్ళిపోయాడు.

ఒక వారం తిరగకుండానే అతడు మళ్ళీ మా ఇంటికి వచ్చాడు. "ఇవి చదవండీ" అంటూ కొన్ని కాగితాలను నా చేతిలో పెట్టాడు. "ఏదో రాసినట్టున్నారే" అంటూ వాటిని చదవడం మొదలెట్టాను.

"నన్ను చెప్పనివ్వండి" అదీ శీర్షిక. అది చదివాక నా ముఖంలో నెత్తురు చుక్క లేదంటే నమ్మండి. "మీతో పోలిస్తే నా సంస్కారమేపాటిదో తెలిసొచ్చిందండీ" అని హీనంగా అన్నాను. అందులోని ప్రతి మాటా నా గురించి అభిమానంతో ఉదారంగా అన్నదే.

"నేను నిరంతర వర్తమానం కదా! ఇంత తొందరగా ఎలా రాశానని ఆశ్చర్యపోకండి. ఇది చాలా కాలంగా నాలో నలుగుతున్నది" అన్నాడు స్వామి.

అతన్ని నేను మరి కలుసుకోలేదు. ■